క్లుప్తంగా

మురుగునీరు తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

ముత్తారం: మండలంలోని కేశనపల్లి తెనుగుపల్లె ప్రధాన కూడలిలో ఓ చేతిపంపు చుట్టూ మురుగు నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి స్పందించారు. చేతి పంపు చుట్టూ ఉన్న మురుగు నీరును తొలిగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ 'సాక్షి'కి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

గోదావరిఖనిటౌన్: స్థానిక గంగానగర్‌కు చెందిన పైడి సతీశ్ అనారోగ్యంలో మృతి చెందాడు. కాగా దాతల సాయంతో సతీష్ కుటుంబానికి రూ.22వేలు అందించినట్లు నీడ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు పల్లెర్ల రమేశ్ గౌడ్ తెలిపారు. నీడ స్వచ్ఛంద సంస్థ నుంచి రూ.6వేలు, పోస్ట్‌కు సంబంధించి రూ.6వేలు, సీతారామ సేవాసమితి రూ.5వేలు, ఎన్ఆర్ఐ పంజాల సతీశ్ రూ.5వేలు అందించారు ఈ మొత్తాన్ని సతీశ్ కుటుంబానికి అందించామని రమేశ్ చెప్పారు.

పెండింగ్ బిల్లులు వెంటనే క్లియర్ చేయాలి

సుల్తానాబాద్: ఉపాధ్యాయ ఉద్యోగులకు సంబంధించిన అన్నిరకాల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే క్లియర్ చేస్తూ పీఆర్సీ అమలు చేయాలని టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్యాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం తపస్ సంఘం సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు పాకాల విజయేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు, జైపాల్‌రెడ్డి, మండల బాధ్యులు రమేశ్‌బాబు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు పెనాల్టీ రద్దు చేయాలి

రామగిరి: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు విధించే పెనాల్టీని రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. ఆర్జీ–3 పరిధిలోని సివిల్ విభాగానికి చెందిన కాంట్రాక్టు కార్మికులతో బుధవారం సెంటనరీకాలనీలో సమావేశం నిర్వహించారు. సింగరేణి యాజమాన్య విధానాలకు నిరసనగా 19న ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికులతో ఏర్పాటు చేసిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డివిజన్ నాయకులు రమేశ్, మల్లేశ్, శ్రీనివాస్, వెంకన్న, సత్తయ్య, బక్కయ్య, లక్ష్మీ పాల్గొన్నారు.

వ్యక్తి ఆచూకీ సమాచారం అందించండి



రాజశేఖర్

గోదావరిఖని: స్థానిక ఎల్‌బీనగర్‌కు చెందిన జక్కిని రాజశేఖర్(55) ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని, ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి కోరారు. ఆర్థిక ఇబ్బందులు, వ్యాపారంలో నష్టాలు రావడంతో గతనెల 20న ఎల్బీనగర్‌లోని తన ఇంట్లో నుంచి వెళ్లిన రాజశేఖర్ ఇప్పటివరకు తిరిగి రాలేదన్నారు. ఆచూకీ తెలిస్తే 87126 56516 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

ఓదెల మల్లన్న సన్నిధిలో సినీనటుడి పూజలు



ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో సినీనటుడు శివారెడ్డి, బీజేపీ జాతీయ నాయకుడు ప్రదీప్, ప్రముఖ ఆర్టిస్టు వాసు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రదక్షిణలు చేసి కోడెమొక్కులు చెల్లించారు.

పాఠశాలస్థాయి క్రీడలు ప్రారంభం

జూలపల్లి: మండల కేంద్రం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాలస్థాయి క్రీడలను ఎంఈవో కవిత ప్రారంభించారు.

గని ప్రమాదంగా గుర్తించాలి

గోదావరిఖని: శ్రీరాంపూర్ ఏరియా ఇందారం–1ఏ కార్మికుడు శ్రీనివాస్ మృతిని గని ప్రమాదంగా గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈనెల 10న గనిలోని పనిస్థలాల్లో విధులు నిర్వహిస్తుండగా, తీవ్ర అస్వస్థతకు గురై పడిపోయాడన్నారు. రామకృష్ణాపూర్ ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడన్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు
- గ్రామాల్లో రోడ్లపైనే చెత్తాచెదారం
- అధికారుల పర్యవేక్షణ కరువు



నాగెపల్లిలో రోడ్డుపై చెత్తా చెదారం



నాగెపల్లి గ్రామంలో నిరుపయోగంగా మారిన సెగ్రిగేషన్ షెడ్డు

రామగిరి: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చడంతో పాటు, గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో పల్లెప్రగతిలో భాగంగా రూ.లక్షలు వెచ్చించి డంపింగ్ యార్డ్‌లను నిర్మించారు. అయితే వీటి నిర్వహణను గాలికి వదిలివేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజాధనం వృథాగా మారింది.

ఒక్కో కంపోస్టు షెడ్డుకు రూ.2.50లక్షలు..

జిల్లాలో 264 గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ కింద ఒక్కో పంచాయతీకి రూ.2.50లక్షలతో కంపోస్ట్ షెడ్లు నిర్మించారు. దీంతో చెత్తను తరలించేందుకు ప్రతీ పంచాయతీకి ట్రాక్టర్ సైతం కొనుగోలు చేశారు. షెడ్ల నిర్మాణం పూర్తయినా అవి పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి రావడం లేదు. కొన్ని పంచాయతీల్లో ప్రారంభంలో కొంత మేర ఆసక్తి కనబరిచిన అధికారులు.. వాటిని పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. పారిశుద్ధ్య సిబ్బంది తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలి. అక్కడ కంపోస్ట్ షెడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలలో తడి, పొడి చెత్తను వేరుచేయాలి. వర్మి కంపోస్టు తయారు చేసి విక్రయించగా వచ్చిన సొమ్మును పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలి. తడి చెత్తను దాదాపు 45రోజుల పాటు దశలవారీగా ఎరువు తయారీ చేయాల్సి ఉండగా ఆచరణలో అమలు కావడం లేదు. ప్రజలకు తడి, పొడి చెత్తపై అధికారులు అవగాహన కల్పించడం లేదని స్థానికంగా ఆరోపణలు వినవస్తున్నాయి.

రోడ్లపక్కనే పడేస్తున్నారు..

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలనకు ప్రతీరోజు తడి, పొడి చెత్తను సేకరించి వాటిని సెగ్రిగేషన్ షెడ్లకు తరలించి సేంద్రియ ఎరువులు తయారు చేసి పంచాయతీలు సంపద సృష్టించే విధంగా ప్రణాళికలు రూపొందించారు. కానీ సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడం, ప్రత్యేకాధికారుల పాలనలో అధికారులు పర్యవేక్షణ కరువైంది. ప్రస్తుతం ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుల్లో లేదా రోడ్లపక్కనే పడేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు..

ఆయా గ్రామాల్లో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడం లేదు. గ్రామాల్లో చెత్త రోడ్లు, డంపింగ్ యార్డుల బయట దర్శనమిస్తున్నాయి. చెత్త నుండి తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతుంది. ప్రస్తుత వర్షకాలం కావడంతో రోగాలు వచ్చే అవకాశం ఉన్నది. అధికారుల పర్యవేక్షణ లోపంతో చెత్తను డంపింగ్ యార్డులకు తీసుకెళ్ళకుండా ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే



జిల్లాలోని అన్ని గ్రామాల్లో కంపోస్టు షెడ్లను ఉపాధిహామీ పథకం కింద నిర్మించాం. ఒక్కో కంపోస్టు షెడ్డుకు రూ.2.50లక్షలు వెచ్చించాం. వాటి నిర్వహణ బాధ్యత ఆయా గ్రామపంచాయతీలపై ఉంది. పంచాయతీల్లో కొన్ని కారణాలతో షెడ్ల నిర్వహణ సరిగా కొనసాగడం లేదు. కార్యదర్శులు నిత్యం పర్యవేక్షించాలి. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.

– రవీందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడలోని ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్ వీధిలో స్ట్రీట్ లైట్స్ వెలగకపోవడంతో ప్రజలు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అదే వీధిలో గణపతి మండపం ఏర్పాటు చేయడంతో భక్తుల దర్శనంతో పాటు భజన కార్యక్రమాలు నిర్వహించలేకపోతున్నామని భక్తులు వాపోతున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటూ ఎస్సీ కాలనీవాసులు ఆరోపించారు. ఎంపీడీవో స్పందించి వీధి దీపాలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మా ఫోన్ నంబర్ : 97053 46608

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

అభివృద్ధి పనులకు భూకేటాయింపులు చేయాలి



సూచనలు చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని: మంథనిలో అభివృద్ధి పనులకు అవసరమైన భూకేటాయింపులు చేయాలని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల స్కెచ్‌లను పూర్తి చేసి, వివరాలతో నివేదిక సమర్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంథని పట్టణంలో ఉన్న ప్రభుత్వ భూములను బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీతో కలిసి ఆయన పరిశీలించారు. కాటారం క్రాస్ రోడ్ వద్ద గల పాత డంపింగ్ యార్డ్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ భూమి లెవెలింగ్ పనులు చేపట్టాలని సూచించారు. మంథనిలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం, నూతన పురపాలక భవన నిర్మాణం, సబ్‌స్టేషన్ నిర్మాణం, నూతన రెవెన్యూ డివిజన్ అధికారి తహసీల్దార్ అధికారి కార్యాలయాల నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి వీలుగా అనువైన ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంథని ఆర్డీవో వి.హనుమానాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్ ఉన్నారు.

గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో హనుమానాయక్, ఏసీపీ రమేశ్

మంథని: గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలని మంథని ఆర్డీఓ హనుమా నాయక్ అధికారులకు సూచించారు. మంథని సమీపంలోని గోదావరి వద్ద బుధవారం నిమజ్జనం ఏర్పాట్లను గోదావరిఖని ఏసీపీ రమేశ్‌తో పాటు ఆయన పరిశీలించారు. గోదావరి తీరంలో బందోబస్తు, సౌకర్యాలు, ట్రాఫిక్ అంశాలను పరిశీలించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ, వైస్ చైర్మన్ సీపతి బానయ్య, కమిషనర్ గుట్టల మల్లికార్జున్, మంథని సీఐ రాజు, ఎస్సై రమేశ్ ఉన్నారు.

నిమజ్జనానికి కట్టుదిట్టమైన భద్రత కల్పించాలి



పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్, అధికారులు

గోదావరిఖని: గణేశ్ నిమజ్జనానికి కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని రామగుండం పోలీస్‌కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఆదేశించారు. గోదావరి బ్రిడ్జిపై బుధవారం వినాయకుల నిమజ్జనం స్థలాన్ని సీపీ పరిశీలించారు. సీపీ మాట్లాడుతూ గోదావరి వంతెనపై రాత్రిపూట విద్యుత్ దీపాలతో పాటు, పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరినదిలో బోట్‌లు ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా వాహనాల రూట్, ట్రాఫిక్ మళ్లింపు ప్రాంతాలను పరిశీలించి అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అన్ని ప్రభుత్వశాఖల అధికారుల సమన్వయంతో నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, రామగుండం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, అడిషనల్ డీసీపీ రాజు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, గోదావరిఖనిటూటౌన్ సీఐ ప్రసాద్‌రావు, శ్రీరాంపూర్ సీఐ మోహన్, రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్, సింగరేణి అధికారులు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలి



మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: ఏరియాలోని అన్ని కార్యాలయాలు, గనుల పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ సూచించారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర కోల్ మినిస్ట్రీ ఆదేశాల మేరకు 16 నుంచి 30వరకు, అక్టోబర్ 2 నుంచి 31 వరకు స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం సంతోష్‌కుమార్, ఏరియా ఇంజినీర్ నరసింహరావ్, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, సివిల్ డీజీఎం ధనుంజయ, స్టోర్స్ డీజీఎం సుజన్‌మెహ్రా పాల్గొన్నారు.

నేడు జీజీహెచ్‌లో సదరం క్యాంపు

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో గురువారం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చొరవతో సదరం క్యాంపు ఏర్పాటు చేసినట్లు రామగుండం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం నిర్వహించే క్యాంపులో లోకో మోటార్ (ఓహెచ్), మానసిక దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని ఆయన పేర్కొన్నారు. ఇదివరకే స్లాట్ బుక్ చేసుకున్న 80 మందికి జీజీహెచ్ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహిస్తారని మేయర్ చెప్పారు.



సుల్తానాబాద్: నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

185 రకాల నైవేద్యాలు

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయం, వైశ్య భవనం, స్వప్న కాలనీల్లో గణేశ్ విగ్రహానికి లక్ష గరక పోచల దండను వ్యాపారవేత్త సత్యనారాయణ కుటుంబ సభ్యులు సమర్పించారు. శివాలయంలో 185 రకాల నైవేద్యాలు సమర్పించారు.

గణనాథునికి 108 ప్రసాదాలతో నైవేద్యం



యైటింక్లయిన్‌కాలనీ: పూజల్లో జీఎం దంపతులు

యైటింక్లయిన్‌కాలనీ: గణపతి నవరాత్రుల సందర్భంగా సింగరేణి ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ బంగ్లాస్ ఏరియాలో ఏర్పాటు చేసిన గణనాథునికి బుధవారం 108 రకాల నైవేద్యాలను భక్తులు సమర్పించారు. పూజ కార్యక్రమంలో ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ దంపతులు పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీజీఎం వర్క్‌షాప్ ఎర్రన్న, డీజీఎం ఈఈ మురళీకృష్ణ, పర్యావరణ అధికారి సురేశ్‌బాబు, చంద్రశేఖర్, షరీఫ్ మహమ్మద్, ఇతర సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● డంపర్ల పార్కింగ్ యార్డు విస్తరించాలి

గోదావరిఖని: ఓసీపీ–3లో వందటన్నుల డంపర్ల పార్కింగ్ యార్డ్ విస్తరించాలని ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు కొత్త సత్యనారాయణరెడ్డి కోరారు. కృషిభవన్‌లో బుధవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. వందటన్నుల డంపర్‌ల పార్కింగ్ పెంచి ఆపరేటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని విన్నవించారు. 15రోజుల్లో స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. నాయకులు ప్రసాద్, ఐరెడ్డి సంపత్ రెడ్డి, లింగమూర్తి, భీముని సత్యనారాయణ, ఆకుల రాజయ్య చల్ల శ్రీనివాస్, శేషుకుమార్, సోగాల రవీందర్, లక్ష్మణరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కాంట్రాక్టు కార్మికుల కార్యవర్గం ఎన్నిక

రామగిరి: ఐఎన్‌టీయూసీ అసంఘటిత కార్మిక సంఘం ఓసీపీ–2 నూతన కార్యవర్గాన్ని బుధవారం ప్రకటించారు. మినిమమ్ వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఓసీపీ–2 కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సెక్రటరీగా రాజేశం, అసిస్టెంట్ పిట్ సెక్రటరీగా పులి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు శంకర్, జిల్లా కార్యదర్శి కిరణ్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు.

● సెక్యూరిటీ గార్డుల నూతన కమిటీ ఎన్నిక

రామగిరి: ఆర్జీ–3 ఏరియా ఏఐటీయూసీ సెక్యూరిటీ గార్డు నూతన కమిటీని బుధవారం సెంటనరీకాలనీ మహేంద్రభవన్‌లో డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు, బ్రాంచ్ సెక్రటరీ ఎం.రాంచంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ సలహాదారుగా నూనె కొమురయ్య, పిట్ సెక్రటరీగా శ్రీనివాస్‌రాజ్, అసిస్టెంట్ సెక్రటరీలుగా శంకర్, రాజేశం, శంకరయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా భాస్కర్, రవీందర్, తిరుపతి, వెంకటేశ్వర్లు, సలీం, శ్రీకాంత్, రాంచందర్, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా వీ.టి.రెడ్డి, ఎస్అండ్‌పీసీ ఇన్‌చార్జిగా రాజేందర్‌ను ఎన్నుకున్నారు.

● గ్యాస్ స్టవ్, సిలిండర్లు అందజేత

ఎలిగేడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలకు బుధవారం కేశెట్టి వైకుంఠం–వజ్రమ్మల జ్ఞాపకార్థం వారి మనువడు రాఘవేంద్ర ఫర్టిలైజర్స్, భారత్‌గ్యాస్ భాగస్వాములు కేశెట్టి రాఘవేంద్ర గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌లు అందజేశారు. పాఠశాల హెచ్ఎంలు దేవేందర్‌రావు, జ్ఞానేశ్వర్, ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సతీశ్‌బాబు, మాజీ వార్డుసభ్యులు కవ్వంపల్లి నారాయణ ఉన్నారు.

● అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

కమాన్‌పూర్: గోదావరినది, మానేరు పరివాహక ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకొని ట్రాక్టర్లను సీజ్ చేస్తామని మైనింగ్ ఏడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని సూచించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఏడీ పేర్కొన్నారు.

● సింగరేణి ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

రామగిరి: సింగరేణి ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు ఆరోపించారు. ఓసీపీ–2 పిట్ సెక్రటరీ ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని సంఘాల మద్దతుతో సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. బ్రాంచ్ కార్యదర్శి కొమురయ్య, నాయకులు కుమార్, ఎండీ అహ్మద్ పాషా, వేణుగోపాల్, మహేశ్, మీనయ్య పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చిత్రపటానికి లారీ యాజమానుల సంక్షేమ సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. లారీ అసోసియేషన్‌కు వడ్ల టెండర్, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ లోడింగ్ ఇప్పించారని పేర్కొంటూ బుధవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు.

● అయ్యప్ప ఆలయంలో మహా అన్నదానం

యైటింక్లయిన్‌కాలనీ: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం మహా అన్నదానం నిర్వహించారు. ఆలయ గురుస్వామి శ్రీఅద్దెంకి సారంగచారి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలోని గణపతి స్వామి మూలవిరాట్‌కు అర్చకులు ఫల పంచామృతాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పెద్దపల్లిరూరల్: మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ పెద్దపల్లి జెండా కూడలిలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

● హెచ్ఎం అనుమతి లేకుండా బయటకు వెళ్లొద్దు

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది హెచ్ఎంల అనుమతి లేకుండా మూమెంట్ రిజిస్టర్‌లో రాయకుండా బయటకు వెళ్లరాదని జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి, కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు తెలిపారు. బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. సందర్శన సమయంలో ఒక ఉపాధ్యాయుడు మూమెంట్ రిజిస్టర్‌లో రాయలేదని, రాయనందున చర్య కోసం ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కాగా హెచ్ఎం రత్నాకర్‌రెడ్డి అనుమతితోనే భోజనం చేసేందుకు వెళ్లానని ఆ ఉపాధ్యాయుడు తెలిపారు.

● ఎంపీడీవో క్వార్టర్లలో ఒకరి ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్: పట్టణానికి చెందిన కల్వల సుదర్శన్(55)అనే వ్యక్తి ఎంపీడీవో క్వార్టర్లలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం పట్టణానికి చెందిన సుదర్శన్ ఈ నెల 6న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. భార్య శశికళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా బుధవారం రాత్రి క్వార్టర్ల గది నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు సమాచారం ఇవ్వగా వెళ్లి పరిశీలించారు. సుదర్శన్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్సై అన్నారు.

● సీపీఐ సీనియర్ నేత నారాయణ మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల మాజీ సర్పంచ్, సీపీఐ సీనియర్ నాయకుడు మద్దుల నారాయణ (82) బుధవారం అనారోగ్యంతో మరణించారు. విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య నివాళి అర్పించారు.

పని ప్రదేశాల్లో తనిఖీ చేయాలి

రామగిరి(మంథని): గనిలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని కార్పొరేట్ సేఫ్టీ జీఎం శ్రీనివాస్ అన్నారు. ఈనెల 11 – 24వ తేదీ వరకు ఏపీఏలో విధులు నిర్వర్తించే ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల శిక్షణ తరగతులను ఆయన స్థానిక ఎంవీటీసీలో బుధవారం ప్రారంభించి మాట్లాడారు. పని ప్రదేశాలను నిర్ణీత సమయంలో తనిఖీ చేసి ప్రమాద సూచనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎస్ గుప్తా, ప్రాజెక్టు అధికారి నాగేశ్వరరావు, ఏరియా సేఫ్టీ అధికారి రాజశేఖర్, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామ శివారులో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో రెండు అసిస్టెంట్ కుక్ (వంట మనుషులు) పోస్టులకు కాంట్రాక్టు ప్రాతిపదికన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి తొటం కల్పన, మండల విద్యాధికారి ఆరెపల్లి రాజయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ కుక్ పని చేయగలిగే మహిళలు అంతర్గాం మండల పరిధిలో నివసించి ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణత, ఏదైనా గుర్తింపు ఉన్న హాస్టల్, గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలల్లో వంట చేసిన అనుభవం కలిగి 18 ఏళ్లు నిండిన మహిళలు దరఖాస్తు చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ప్రతీరోజు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల లోపు కేజీబీవీలో నేరుగా సంప్రదించాలని వారు సూచించారు.


ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ సందర్శించారు. పలువురు పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన రక్త పరీక్షల మిషన్ పని చేయడం లేదని, పీహెచ్‌సీ చుట్టూ పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని వివరించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పీహెచ్‌సీలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయని, వైద్యం కోసం వచ్చే వారికి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. పీహెచ్‌సీలో పర్మినెంట్ వైద్యాధికారిని నియమించాలని, వసతులు కల్పించాలని అఖిలపక్షం నాయకులు గుర్రం లక్ష్మిమల్లు, నల్లవెల్లి శంకర్, మచ్చగిరి రాము, జంగపెల్లి అజయ్ మండల ప్రత్యేక అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

బేస్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపిక

రామగుండం: అంతర్గాం మండలం పొట్యాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జి.స్నేహ, ఎం.ఐశ్వర్య, గణేశ్, అరవింద్, రాజ్‌కుమార్, అభిలాష్ తదితరులు బేస్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎం.సంగీత తెలిపారు. ఈనెల 14–16వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, పీడీ తిరుపతి అభినందించారు.

అలరించిన నృత్యాలు



పెద్దపల్లిలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో 54 అడుగుల మట్టి విగ్రహం మరో ఖైరతాబాద్‌ను తలపిస్తోంది. నవరాత్రోత్సవాల్లో భాగంగా వినాయక మండపం వద్ద బుధవారం సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

అడిషనల్ కలెక్టర్‌కు వినతి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం ఉన్న ప్రాంతంలో మురుగు కాలువను రోడ్డుగా మార్చారని దళిత లేబర్ వెల్ఫేర్ సంస్థ నాయకుడు కైలాసం ఆరోపించారు. బుధవారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి ఆయన వినతిపత్రం అందించారు.